
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5
శ్రీ సత్యసాయి
శనివారం 10 జనవరి 2025

# సమస్యలపై ప్రజలను తిప్పుకోవద్దు తక్షణం పరిష్కారం చూపండి

పుట్టపర్తి, జనవరి 9 (అనంత ప్రభ)

ప్రజల సమస్యలపై కార్యాలయాల చుట్టూ అదేపనిగా తిప్పుకొని విసిగించవద్దని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ అధికారులకు సూచించారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని ఐటిఐ ప్రాంగణంలో పుట్టపర్తి నియోజక వర్గంలోని ఓడి చెరువు, నల్ల మాడ, ఆమడ గూరు మండలాల ప్రజలతో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. ప్రజలు జిల్లా స్థాయికి నియోజకవర్గ స్థాయికి ప్రజలకు వచ్చి పోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని భావించి నియోజకవర్గ స్థాయిలో ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ ను ఈ మూడు మండలాలకు సంబంధించి పుట్టపర్తిలో ,ఆ మూడు మండలాలకు సంబంధించి ఓడి చెరువు లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఏదైనా సమస్యపై అధికారుల వద్దకు వస్తే తక్షణమే వాటి పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ప్రజాసేవయే పరమావధిగా పనిచేసే అధికారులకు భవిష్యత్తులో వారికి అన్ని విధాలుగా తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రజా గ్రీవెన్స్ లో ఇచ్చిన అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా తక్షణం ప్రజలకు న్యాయ పరిష్కారం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేకంగా ప్రజా గ్రీవెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. అంటే కాకుండా జిల్లా స్థాయిలో కలెక్టర్ జిల్లా యంత్రాంగం ప్రతి సోమవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యేలు మంత్రులు ప్రతి శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రెవిన్యూ సమస్యలు , విద్యుత్ ,త్రాగునీరు పారిశుధ్యం ,ఉపాధి హామీ బిల్లులు డ్రిప్పు , స్ప్రింకర్లు ,నూతన పెన్షన్లు,గృహాలు ,తదితర సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అర్జీలు అందజేశారు. ప్రజా గ్రీవెన్స్ కు వచ్చిన ప్రజలు ఎమ్మెల్యే తోపాటు మాజీ మంత్రి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం



చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓడి చెరువు మండల టిడిపి కన్వీనర్ జయచంద్ర ,ఆమడ గూరు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి,నల్లమాడ మండల కన్వీనర్ మైలే శంకర్, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి , చెరువు సంఘం అధ్యక్షులు బొడ్డు జయన్న ,ఓడి చెరువు మండల సహకార సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా శివారెడ్డి, కొత్తచెరువు మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమనాథరెడ్డి డైరెక్టర్లు నిజాం వలి,నంజప్ప. , కంచి సురేష్ , బుద్ద ల ప్రవీణ గోపీనాథ్ రెడ్డి, మస్తానమ్మ, తహశీదార్లు శ్రీనివాసరెడ్డి ,రామనాథరెడ్డి, ఎంపీడీవోలు శివప్రసాద్ రెడ్డి ,మునెప్ప , సిరికల్చర్ ఏడి వెంకటరమణ నాయక్ ,ఏవో గజ్జల శ్రీనివాస్ రెడ్డి, సీఐ భాస్కర్ గౌడ్ ,ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి ,ఎపిడి రమేష్ బాబు ,ఏపీఓలు ,సిబ్బంది ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు ఎంపీటీసీ శ్రీనివాసులు , కూటమి పార్టీల నాయకులు అంజినప్ప,శ్రీనివాస్ నాయక్ ,ఓబుల్ రెడ్డి , లక్ష్మనారాయణ రెడ్డి , కొత్త సుధాకర్ రెడ్డి, గంటా శ్రీనివాస్ ,సాదీ నాగరాజు , రామంజుల నాయుడు ,కుమార్ రాయల్ , నాగేందర్ రెడ్డి , గ్రామ పంచాయతీ కార్యదర్శులు ,సచివాలయ ఉద్యోగులు,ఐసీడీఎస్ ,వెలుగు ,వ్యవసాయం ,గ్రామీణాభివృద్ధి , ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఇతర శాఖల అధికారులు , ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యస్.సి.యస్.టి చట్టం పై సదస్సు నిర్వహించిన ఐ.ఏ.ఏ.వి.ఒ. ఆర్గనైజేషన్ అయ్యంకి సురేష్ బాబు




డి. హిరేహాల్, జనవరి 9 (అనంత ప్రభ)

డి. హిరేహల్ మండలం, మురిడి గ్రామంలో మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ ఇండియన్ యాక్ట్స్ అవార్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ రాయలసీమ రీజినల్ చైర్మన్ బోమ్మిసెట్టి వేంకట రమణ ఆద్వర్యంలో" నిర్వహించిన కార్యక్రమంలో" ముఖ్య అతిథిగా అయ్యంకి సురేష్ బాబు మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాల ప్రాంతంలోని అణగారిన వర్గలకు షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల ఆకృతుల నిరోధక చట్టం 1989 సెక్షన్ 3 ప్రకారము అకృత్యాలు అనగా" అనారోగ్యకరమైన పదార్థాలను ఉద్దేశపూర్వకంగా త్రాగించుట, నివాస గృహాలు లేక ప్రాంగణాలలో మల మూత్రలను, మురుగునీటిని,మృత కళేబరములను పారవేయడం, మెడలో చెప్పుల దండ వేయడం, నగ్నంగా - అర్ధ నగ్నంగా ఊరేగించడం, వస్త్ర హరణం, గుండు చేయడం, మీసాలను తొలగించడం, ముఖానికి రంగులు పూయడం, వ్యవసాయ భూములు, నివేసిన స్థలాల నుండి వెళ్ళగొట్టడం - అక్రమంగా ఫంటను ధ్వంసం చెయ్యడం - ఫలసాయాన్ని అక్రమముగా తీసుకు పోవడం, నీటి హక్కులకు భంగం కలిగించడం, చంపుతానని, గాయపరుస్తానని, నష్టపరుస్తానని భయపెట్టడం, భూములకు సంభందించిన దొంగ రికార్డ్స్ సృష్టించడం, భిక్షటన, విట్టి చాకిరి చేయించడం, మానవ శరీరాలు జంతు కళేబరాలు పూడ్చి పెట్టాలని, తోలు వలవాలని పనులు చేయియలని బలవంతం చేయడం, బలవంతంగా పాకీ పని చేయించడం, దేవ దాసిగా అంకితం అవ్వాలని ప్రోత్సహించడం, ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా లేక ఓటు వేయవద్దని బలవంతం చేయడం, నామినేషన్ వేయవద్దని లేక నామినేషన్ వెయ్యాలని, ఒక వ్యక్తిని ప్రతిపాదించ వద్దని బలవంతము చేయుట, రాజ్యంగం బద్దంగా ఎన్నికైన వారి విదులకు ఆటంకం కలిగించడం, సాంఘిక బహిష్కరణ, ఉద్దేశ పూర్వకంగా అధికారులతో బెదిరించడం, తప్పుటి దావాలు వేయడం, ప్రజలందరు ముందూ దూషించడం, భక్తితో ఆరాధించు వస్తువును ధ్వంసం చేయడం, షెడ్యూల్డ్ జాతులకు చెందిన మహిళని తెలిసి కూడా శారీరకపరమైన శృంగారపరమైన తాకడం అసభ్యంగా మాట్లాడడం, వంటి చర్యలు అన్నీ షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల ఆకృతుల నిరోధక చట్టం 1989 నియమాలు వర్తిస్తాయని, షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల ఆకృతుల నిరోధక నిబంధనలు 1995 ప్రకారం బాధితులకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం వస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో" మురిడి గ్రామం నివాసులు బసవ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంపద సృష్టిస్తామని చెప్పి రాష్ట్రాన్ని అప్పులుపాలు చేశారు

- సంక్షమం కుదించి ప్రజల నెత్తిన అప్పులు భారం మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి
- కూటమి అప్పుల పా పాలనపై అసలు నిజాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం

ఉరవకొండ, జనవరి 9 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ క్యాడర్కు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని వైస్సార్సీపీ ముఖ్య నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి హాజరై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకు దూరంగా ఈ ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్ర భవిష్యత్తునే తాకట్టు పెట్టేలా మారాయని ఆయన విమర్శించారు. ఒకవైపు సంక్షమ పథకాలు కుదింపులు, మరోవైపు లక్షల కోట్ల అప్పులతో ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వ అసలుస్వరూపాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న ప్రతి అప్పు పేదల సంక్షమం కోసమేనని వై. విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా, అమ్మ ఒడి,



విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా కోట్లాది కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపిన విషయాన్ని గణాంకాలతో సహా ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రభుత్వ వైఫల్యాలు, అప్పుల నిజాలు, వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, ఈ మూడు అంశాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల పక్షన నిలబడి పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించారు.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టండి
## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి

రాయదుర్గం, జనవరి 9 (అనంత ప్రభ)

రాయదుర్గం పట్టణంలోనీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రహరి, ఇతర పనులను త్వరగా పూర్తి చేయించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో శుక్రవారం సాయంత్రం ఆయన ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్ లాల్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాచీనమైన ఆలయాలలో ఒకటైన ఈ గుడిని మన రాష్ట్ర ప్రజలే కాక ఇతర రాష్ట్రాల భక్తులు కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారనీ వివరించారు. ఆలయ ప్రాకార నిర్మాణం కోసం గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 2.65కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు 2024 జూన్ లో కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటి వరకు ఫౌండేషన్, రెండు వరుసల ప్రాకారం పనులతో కలిపి సుమారు 40% పూర్తి అయ్యాయని వివరించారు.

అయితే "శ్రీ వాణి పథకం" కింద గతంలో చేపట్టిన



పనులను సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడక ముందే ఈ ఆలయ పనులు ప్రారంభమైనందున, సదరు ఉత్తర్వులు దీనికి వర్తించబోవన్నారు. వినియోగ ధృవీకరణ పత్రం, ఎం బుక్, అడ్వాన్స్ స్టాంప్ రసీదు ఇప్పటికే సంబంధిత అధికారులకు సమర్పించబడ్డాయని తెలియజేశారు. ఈ ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యత, ప్రజల భక్తి విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని ప్రాకారం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం వెంటనే పనులు కొనసాగించేలా చూడాలని విన్నవించారు

## ఎలిమినేటింగ్ చైల్డ్ మ్యారేజ్ పై ప్రభుత్వ పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

అనంత, జనవరి 9 (అనంత ప్రభ)

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అయిన ఈ. భీమారావు ఆదేశాల మేరకు శుక్రవారం రోజున అనంతపురం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా

"బాల్య వివాహాలు మరియు కౌమార సాధకరత అంతం

ఎలిమినేటింగ్ చైల్డ్ మ్యారేజెస్ , 2025 లో భాగంగా 100 రోజుల ప్లాన్ ఆఫ్ యాక్షన్ అనగా 17-12-2025 నుండి 27-03-2026 వరకు అనంతపురము లోని శారద బాలికల ఉన్నత పాఠశాల , అనంతపురము మరియు పొట్టిశ్రీరాములు బాలుర ఉన్నత పాఠశాల, అనంతపురము నందు బాల్య వివాహాలు మరియు కౌమార సాధకరత అంతం మరియు లాంటి వాటిపై 05-1-2026 నుండి 12-6-2026 వరకు సంబంధించి న్యాయ విజ్ఞాన సదస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఆడపిల్లలకు చదువు పట్ల జిజ్ఞాసను పెంచి వారి అభివృద్ధిని మరియు




హితోదికంగా వారి కుటుంబ శ్రేయస్సును కోరుకుందాం అన్నారు. ఈ బాల్య వివాహాలు అన్న దురాచారం పట్ల అందరూ అవగాహన కలిగి ఇలాంటి వాటి పట్ల జాగరుకతతో ఉండి మెరుగైన సమాజం ఎదుగుదలకు మన వంతు తోడ్పడదాం అని పిలుపునిచ్చారు. మరియు శ్రీ స్వామి వివేకానంద ప్రవచనలు విద్యార్థులు తమ సొంత మార్గంలో నేర్చుకోవాలని, విద్య అందరికీ అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ ప్రిన్సిపాల్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం, జనవరి 9 (అనంత ప్రభ)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బుక్కరాయసముద్రం నందు "ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభయాన్ " కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి హైరిస్క్ గర్భవతులకు చికిత్స, పరీక్షలు, సలహాలు, మందులు తదితర వాటినే వారికి అందజేసి చికిత్స చేయడం జరిగింది. ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈవీ దేవి గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు ఇక్కడ జరుగుతున్నటువంటి గర్భవతుల నమోదు, వారికి అందిస్తున్న వైద్య సేవలు,చికిత్స విధానం, పరీక్షలు తదితర వివరాలు పరిశీలించి తగు సూచనలు చేసి గర్భవతుల మాతృత్వ మరణాలు శిశు మరణాలు ఎట్టి పరిస్థితులలోనూ జరగకుండా జాగ్రత్తలు చెప్పి సురక్షత ప్రసవం అయ్యేట్టుగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మ ని ఆదేశించారు. అలాగే ప్రతి నెల ఈ కార్యక్రమం రోజు




పసుపుల బ్రదర్స్ భోజన సదుపాయం గర్భవతులకు కల్పించడం జరుగుతుందని విషయం తెలిపిన వెంటనే డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఈ బీ దేవి అక్కడికి చేరుకొని గర్భవతులకు భోజనాన్ని వడ్డించి పరిశీలించింది ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మ మరియు డాక్టర్ తెహరున్నీసా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహన్ రావు సూపర్వైజర్లు విజయలక్ష్మ, పీహెచ్ఎన్ లు సుజాత ,నాగలక్ష్మ ఫార్మసిస్టు మహబూబ్ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు తదితర క్షత్రస్థాయి సిబ్బంది అందరూ పాల్గొన్నారు

## రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో రైళ్ల ఆపుదలపై డి ఆర్ ఎం కు వినతి



యాడికి, జనవరి 9 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులు రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో డివిజనల్ రైల్వే మేనేజరును కలిసి ధర్మవరం మరియు ఎగ్మోర్ రైళ్లను రాయలచెరువులో నిలుపుదల చేయాలని కోర‌ంతూ వినతి పత్రం అందజేశారు. యాడికి మండల ప్రజలకు ఈ రైళ్ల ఆపుదల అత్యవసరమని, ముఖ్యంగా విద్యార్థులు, వ్యాపారస్తులు మొదలైన వారికి ఎంతో ఉపయోగపడుతుందని వారు వివరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఎం స్పందిస్తూ, ప్రయాణికుల అవసరాలు, ప్రయాణికుల రద్దీ పరిస్థితులు, అలాగే సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు

## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సర్వే పనులపై క్షేత్రస్థాయి పరిశీలన



యాడికి జనవరి 9 (అనంత ప్రభ)

యాడికి మండలంలోని కమలపాడు, కుందనకోట గ్రామాల్లో ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అనంతపురం జిల్లా సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రూప్ల నాయక్ ఈ పరిశీలన చేపట్టారు. యాడికి తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు పంప్డ్ స్టోరేజ్ కు సంబంధించిన సర్వే పనులను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో డీఈలు ఆంజనేయులు, రవికుమార్, మండల సర్వేయర్ శేష సాయి, గ్రామ సర్వేయర్లు మౌలాలి, చంద్ర, సాకేత్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలిసిన సంజీవ రాయుడు



యాడికి, జనవరి 9 (అనంత ప్రభ)

కర్నూలు జిల్లా మంత్రాలయంలో నిర్వహించిన ఎల్ఐసి ఏజెంట్ల సమావేశంలో మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాడికి వైసిపి మండల కన్వీనర్ ఎం సంజీవ రాయుడు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిపత్రి నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి ఎమ్మెల్యే సంజీవ రాయుడును అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో సమిష్టిగా కృషి చేయాలన్నారు

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూముల క్షేత్రస్థాయి పరిశీలన



యాడికి జనవరి 9(అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి సంబంధించిన భూములను ఉన్నతాధికారులు మరియు యాడికి తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఈవో సుబ్రహ్మణ్యం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా వీఆర్వో దామోదర్ నాయుడుతో కలిసి కమలపాడు రోడ్డు, పిన్నేపల్లె రోడ్డు తదితర ప్రాంతాలలోని దేవాలయ భూములను సందర్శించి సరిహద్దులు, ప్రస్తుత స్థితిగతులు, వినియోగంపై వివరాలను పరిశీలించారు. దేవాలయానికి చెందిన భూములు ఆక్రమణల నుంచి రక్షణ పొందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. భూములపై సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనతో దేవాలయ ఆస్తుల పరిరక్షణకు మరింత బలమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు

## ప్రజల ప్రాణాలతో చెలగాటం

కళ్యాణదుర్గం, జనవరి 9 (అనంత ప్రభ)

భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) కాలువ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కాలువలోకి దూసుకుపోయి ప్రమాదాలకు గురికాక తప్పదు. నిబంధనలు పట్టించుకోకుండా ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్ట్ సంస్థపై ప్రజలు మండిపడుతున్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీటిని తీసుకెళ్లేందుకు కాలువ పనులు జరుగుతున్నాయి. పనులను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ కంపెనీ చేస్తోంది. అయితే ఒంటిమిద్ది వద్ద అనంతపురం-- కళ్యాణదుర్గం ప్రధాన రహదారిని తవ్వి బ్రిడ్జి నిర్మిస్తున్నారు.ఇంతవరకు బాగానే ఉన్నా.. అక్కడి నుంచి వాహనాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ (రోడ్డు డైవర్షన్) పనులు చేశారు. ఇది వాహనదారులకు అత్యంత ప్రమాదకరంగా మారింది. కాలువ తవ్విన చోట వాహనదారులకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీనికి తోడు కాలువ తవ్విన చోట డ్రమ్ములు, కోన్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటి స్థానంలో కర్రలు అమర్చడం కొసమెరుపు. రోడ్డు డైవర్షన్ చేయాలంటే సదరు కాంట్రాక్టరు ముందుగా దారి మళ్లింపు ఎటువైపు ఉందో స్పష్టంగా చూపించే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా విస్మరించారు. వాహనాలను నియంత్రించడానికి రెడ్, ఎల్లో, గ్రీన్ రంగు లైట్లు లేదా ఫ్లాషింగ్ లైట్లు ఏర్పాటు చేయలేదు. రాత్రి పూట రహదారి స్పష్టంగా కనిపించడానికి అదనపు లైట్లు ఏర్పాటు చేయలేదు. వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక గుర్తులనూ ఏర్పాటు చేయలేదు.

## జాతీయ ర. రో. భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం..




రాయదుర్గం, జనవరి 9 (అనంత ప్రభ)

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా మోటార్ వాహనాల తనిఖీ అధికారి అయిన వై విశ్వనాథ రెడ్డి శుక్రవారం రాయదుర్గం రాయల్ డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. అందులో కాలేజీ కరెస్పాండంట్ బండి విక్రమ్ , ప్రెసిడెంట్ బండి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఎ× మాట్లాడుతూ ముఖ్యంగా యువత రహదారి పై తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు , జరిగే ప్రమాదాల వివరాలు, ప్రమాదాలు జరుగుతున్న విధానాల గురించి కూలంకషంగా వివరించారు. నియమాలు పాఠించకపోతే పడే జైలు శిక్షల గురించి కక్షన్నంగా తెలియజేసారు. డ్రైవింగ్ లో సెల్ ఫోను వాడకం, యువత అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు యొక్క ప్రాముఖ్యతను లైసెన్సులు తీసుకోవలసిన విధానాలను కూలంకషంగా తెలియజేసారు.

అదేవిధంగా సమావేశంలో పాల్గొన్న ఇతర పెద్దలు తమ అనుభవాలను, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసారు

## యాడికి మండలంలో పంచాయతీల అభివృద్ధిపై డిడిఓ సమీక్ష





యాడికి, జనవరి 9 (అనంత ప్రభ)

యాడికి మండలంలోని పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై డివిజనల్ డెవలప్మెంట్ అధికారి విజయలక్ష్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం యాడికి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను వసూళ్లు, స్వామిత్వ పథకం అమలు, స్వచ్ఛత కార్యక్రమాల పురోగతిపై ఆమె సమీక్షంచి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి యాడికి గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. యాడికి మండలం వేములపాడు గ్రామపంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఆమె సందర్శించి, గ్రామపంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీరరాజు, డిప్యూటీ ఎంపీడీవో శశికళ, యాడికి ఇన్‌చార్జి పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్‌తో పాటు మండలంలోని అన్ని పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం



యాడికి, జనవరి 9 (అనంత ప్రభ)

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి ఆదేశాల మేరకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా హై రిస్క్ గర్భవతులకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి, సమగ్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన సూచనలు, సలహాలు డాక్టర్లు అందజేశారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొని గర్భవతులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. అలాగే కాన్పు సమయంలో తప్పనిసరిగా 108 సేవల ద్వారానే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. హై రిస్క్ గర్భవతులు గర్భం దాల్చిన మూడో నెల నుంచి కాన్పు సమయానికి 15 రోజులు ముందు వరకు ప్రతి నెలా ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భవతులకు ఉచిత భోజన సౌకర్యాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త రాయల చెరువు రమణారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జుబేదా, పిహెచ్ఎన్ శోభా కుమారి, మేల్ సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## కబడ్డీ టోర్నమెంట్ బృందం కు విరాళం అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు



రాయదుర్గం, జనవరి 9 (అనంత ప్రభ)

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి కిష్టప్ప కబడ్డీ టోర్నమెంట్ బృందం సభ్యులకు విరాళం అందించారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని లక్ష్మ బజార్ లో ఉన్న హనుమాన్ టెక్స్టైల్స్ భవనంలో ఆ సంక్షమ సేవా సమితి ఉపాధ్యక్షులు మలకన్న, సభ్యులతో కలిసి వాల్మీకి సంక్షమ సేవా సమితి తరపున విరాళం ఇచ్చారు. రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ కబడ్డీ బృందం సభ్యులు వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షులను కలుసుకొని కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహణ విషయమై వివరించగా అందుకు సమ్మతించిన ఆయన రూ. 10100లు విరాళం వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడలో రాణించి విజయం సాధించి రాయదుర్గం కు మంచి పేరు గడించాలని త్వరలో అందుకున్న కబడ్డీ బృందం సభ్యులకు సూచించారు. క్రీడలతో గుర్తింపు లభిస్తుందని తాలూకా స్థాయి నుండి రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో యువకులు క్రీడల్లో పాల్గొని తమ సత్తాను చాటి జన్మనిచ్చిన జన్మభూమి రుణం తీర్చుకోవాలని ఆయన యువకులకు తెలిపారు. క్రీడలకు వాల్మీకి సంక్షమ సేవా సమితి ఆధ్వర్యంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన క్రీడా బృందం సభ్యులకు చెప్పారు. తాము అడిగిన తక్షణం టోర్నమెంట్ నిర్వహణకు విరాళమిచ్చి తమను ప్రోత్సహించినందుకు కబడి ఓపెన్ టోర్నమెంట్ బృందం సభ్యులు వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంక్షమ సేవాసమితి యూత్ సభ్యులు హరీష్ కుమార్, నరేంద్ర, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు అజయ్ టైలర్ రఘు, పై తోట శ్రీనివాసులు, రుద్ర, ప్రశాంత్, మిత్రులు న్యాయవాది సూర్యజాన్సన్ పాల్గొన్నారు.




## పామ్ ఆయిల్ తోటలను పరిశీలించిన ఆయిల్ ఫామ్ అడ్వైజర్ అధికారి నసీం అలీ



కూడేరు జనవరి 9 (అనంత ప్రభ)

కూడేరు మండలంలో శుక్రవారం రోజున అంతరగంగా,చోళసముద్రం, సింగంపల్లి

జల్లిపల్లి గ్రామాలలో ఆయిల్ ఫామ్ అడ్వైజర్ గ్రామాల్లో పామాయిల్ తోటలను పరిశీలించారు. అనంతరం పామ్ ఆయిల్ పంట సాగు, ఉపయోగాలు, ప్రతికూలతలు, ప్రయోజనాలు, వాటి సంరక్షణ, అంతరపంట యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. మరియు ప్రభుత్వం నుంచి పామ్ ఆయిల్ మొక్కలను 100% సబ్సిడీలతో రైతులకు ఎం. కె అగ్రోటెక్ కంపెనీ ద్వారా పామాయిల్ పంట సాగు చేయాలనుకున్న రైతులకు ఈ కంపెనీ ద్వారా మొక్కలను అందించడం జరుగుతుంది కావున మండలంలో రైతులు ఈ అవకాశాన సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం కె అగ్రోటెక్ కంపెనీ డీజీఎం మురళి,దుర్గ ప్రసాద్, జే. సుమంత్, మరియు చంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఆసక్తిగా పాల దిగుబడి పోటీలు



రాప్తాడు, జనవరి 9 (అనంత ప్రభ)

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'అనంత పాల ధార' జిల్లా స్థాయి పాల దిగుబడి పోటీలు అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో గురువారం ఆసక్తిగా సాగాయి. ఉదయం 6 గంటల నుంచే శింగనమల, నార్పల, బుక్కరాయసముద్రం, రాప్తాడు, అనంతపురం రూరల్ తదితర మండలాల నుంచి 59 మంది పాడి రైతులు ఉత్సాహంగా తమ పశువులతో పోటీలకు తరలివచ్చారు. పారదర్శకత, శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా అనుభవజ్ఞులైన పశువైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు, పాల కొలతలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు మరోమారు పాల ఉత్పత్తి నమోదు చేశారు. ఉదయం, సాయంత్రం పాల దిగుబడుల ఆధారంగా విజేత పాడి పశువులను ఎంపిక చేశారు.

## అప్పలరాజుపై పీడీ యాక్ట్ ఎత్తివేయాలి



అనంతపురం, జనవరి 9 (అనంత ప్రభ)

రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై చంద్రబాబు ప్రభుత్వం బనాయించిన పీడీయాక్ట్‌ను ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలోని ఎన్జీఓ హోం లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పక్షన నిలిచి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా అప్పలరాజు ఉద్యమాలు చేపడితే అతనిపై అక్రమంగా కేసులు బనాయించి పీడీ యాక్ట్ నమోదు చేయడం దారుణమన్నారు. ఇది పూర్తి కక్ష పూరితంగానే ప్రభుత్వం చేసిందన్నారు. తక్షణమే పీడీ యాక్ట్‌తో పాటు అక్రమ కేసులు ఎత్తి వేయకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయుడు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖరరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, సహాయ కార్యదర్శి రాము, నాయకులు వెంకీ, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, గిరి, రాయుడు, కిష్ట, శ్రీనివాసరావు, రాజారాంరెడ్డి, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, వలి, జయమ్మ, సువర్ణ, వెంకట కొండయ్య, పోతలయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరుత కలకలం

తాడిపత్రి, జనవరి 9 (అనంత ప్రభ)

మండలంలోని తలారిచెరువు-- ఊరుచింతల మార్గంలో చిరుత సంచారం కలకలం రేపింది. ఆ ప్రాంతంలోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది బుధవారం తెల్లవారుజామున చిరుతను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిరుత విషయం తెలియడంతో ఊరుచింతల, తలారిచెరువు, ఆలూరు, వెలమకూరువాసుల్లో భయాందోళన నెలకొంది. రైతులు, పశువుల కాపర్లు హడలెత్తుతున్నారు. ఊరుచింతల-- తలారి చెరువు ప్రాంతంలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీతో పాటు సోలార్, గాలి మరల ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం మరికొన్ని పరిశ్రమలకు చెందిన పనులు జరుగుతున్నాయి. వీటిలో వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాయలసీమలోనే ప్రసిద్ధి చెందిన భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి ఆలయానికి ఈ మార్గంలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. ఆలయం చుట్టూ సెలయేర్లు ఉండడంతో పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. తలారిచెరువు సమీపంలో ఉన్న పురాతన హాజీవలి దర్గాలో హిందూ, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు. రాత్రి సమయాల్లో దర్గాలో బస చేస్తుంటారు. చిరుత సంచారం అందరిలో ఒక్కసారిగా గుబులు రేపింది. చిరుత ఆచూకీ కోసం ముచ్చుకోట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జగన్నాథం, సిబ్బందితో కలిసి గాలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, మేకలు, పశువులను మేపునకు తీసుకెళ్లరాదని హెచ్చరించారు. తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది సైతం ప్రజలను అప్రమత్తం చేశారు. గుత్తి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మధుబాబు మాట్లాడుతూ చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.







## మలబద్ధకంతో ముప్పుతిప్పలు పడుతున్నారా? ఈ ఆయుర్వేద చిట్కాలు పాటించండి

### త్రిఫల చూర్ణం

మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని కలిగించే అత్యంత ప్రభావవంతమైన ఆయుర్వేద నివారణల్లో త్రిఫల చూర్ణం ఒకటి. వేడి నీటిలో దీన్ని కలుపుకుని త్రిఫల టీని తయారుచేసుకోవచ్చు. అర టీ స్పూన్ ధనియాలు, పావు టీ స్పూన్ యాలకులు పొడి చేసుకుని త్రిఫల చూర్ణంతో పాటు ఒక గ్లాసు నీటిలో కలుపుకుని తాగొచ్చు. పేగు కదలికలు బాగుండేలా చేస్తుంది.

వేయించిన సోంపు గింజలు

ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక టీ స్పూన్ వేయించిన లేదా పొడి చేసిన సోంపు గింజలు కలపాలి. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. ఆరోగ్యకరమైన పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. గ్యాస్ట్రిక్ ఎంజైమ్ లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది.

### బేల్ పండు గుజ్జు

వెలగక్కాయని బేల్ పండు అని కూడా పిలుస్తారు. ఇది మలబద్ధకం సమస్యని నివారిస్తుంది. సాయంత్రం భోజనానికి ముందు అరకప్పు బేల్ పండు గుజ్జు, ఒక టీ స్పూన్ బెల్లం కలిపి తినాలి. బేల్ రసంలో కొద్దిగా చింతపండు నీళ్ళు, బెల్లం కలిపి షర్బత్ లాగా చేసుకుని తీసుకోవచ్చు. దయాబెటిక్ బాధితులైతే ఈ పండు తినే ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. ఇది ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. ఎందుకంటే కడుపుని మరింత ఇబ్బంది పెడుతుంది.

## డయాబెటిస్ ఉన్నవారు పరగడుపున ఖాళీ పొట్టతో తినాల్సిన ఫుడ్స్ ఇవే



రోజంతా శరీరం ఉత్తేజంగా పని చేయాలంటే పరగడుపున తినే ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు అల్పాహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. వారు పొట్ట నిండడమే కాదు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలో నెమ్మదిగా విడుదల చేసే ఆహారాలను ఎంపిక చేసుకోవాలి. అల్పాహారంలో షుగర్ స్థాయిలను అధికంగా చేసే ఫుడ్ ను తింటే రోజంతా ఇబ్బంది పడాల్సి వస్తుంది. మధుమేహం ఉన్నవారు ఉదయానే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అధికంగా కలిగి ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే మన కాలేయం అదనపు గ్లూకోజ్‌ని ఉత్పత్తి చేస్తుంది. మీకు దాహంగా అనిపించినా, అతిగా మూత్ర విసర్జన చేసినా, ఉదయాన్నే చూపు మందగించినట్టు అనిపించినా... మీ రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నట్టు లెక్క. కాబట్టి ఆహార పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. పరగడుపునే తినాల్సిన సూపర్ ఫుడ్స్ ఇవే.

1. ఉదయాన పరగడుపున ఒక స్పూను ఆవు నెయ్యిలో చిటికెడు పసుపు పొడి కలుపుకొని తినేయాలి. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను పెరగకుండా రోజంతా కాపాడడంలో ముందుంటుంది. అలాగే తీపి పదార్థాలు తినాలన్న కోరికలను కూడా నియంత్రిస్తుంది. నెయ్యి పొట్ట నిండిన భావనను పెంచితే, పసుపు శరీరంలో ఇన్ఫ్లమేషన్ ను తగ్గిస్తుంది.

2. ఒక టేబుల్ స్పూన్ ఆపిల్ సిడర్ వెనిగర్ తాగిన మంచిదే. లేదా ఒక స్పూన్ ఉసిరి రసం తాగిన ఉత్తమమే. ఇది లేకుంటే గ్లాసు నీటిలో నిమ్మరసం కలిపి పరగడుపున తాగేయండి. ఈ ద్రావకాలు శరీరంపై ఆల్కలైజింగ్ ప్రభావాన్ని చూపిస్తాయి. శరీరాన్ని ఆల్కలీన్‌గా ఉంచడానికి ఈ ద్రవ పదార్థాలను ఎంచుకోవచ్చు.

3. దాల్చిన చెక్క వల్ల మధుమేహులుకు ఎంతో ఉపయోగం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే ఒక మసాలా. రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలు నిర్వహించడానికి ఇది ఎంతో సహాయపడుతుంది. దాల్చిన చెక్కతో టీ చేసుకుని తాగితే మంచిది.

4. మెంతి నీరు మధుమేహులకు నిజంగానే సూపర్ ఫుడ్. దీన్ని తీసుకోవడం వల్ల శరీరం కార్బోహైడ్రేట్లను శోషించుకోకుండా కాపాడుతుంది. ఒక టీ స్పూన్ మెంతి గింజలను రాత్రంతా నానబెట్టి ఉదయం లేచాక ఆ నీటిని తాగేయాలి. ఆ గింజలను కూడా నమిలి మింగేయాలి. ఇలా నెల రోజులు చేస్తే చాలు పూర్తిగా అదుపులోకి వచ్చేస్తుంది.

## వారానికోసారి బాడీ మసాజ్ చేయించుకుంటే ఈ సమస్యలన్నీ మాయం



మనదేశంలో బాడీ మసాజ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటికి వెళ్లే వారి సంఖ్య తక్కువే. కేవలం ధనవంతులు మాత్రమే బాడీ మసాజ్ సెంటర్లకు వెళుతూ ఉంటారు. బాడీ మసాజ్ అంత అవసరం లేదని అనుకుంటూ ఉంటారు చాలామంది. నిజానికి బాడీ మసాజ్ మన శరీరానికి చాలా అవసరం. ఇది ఎన్నో ఆరోగ్య సమస్యలను కట్టడి చేస్తుంది. వారానికి ఒక్కసారి బాడీ మసాజ్ చేయించుకున్నా చాలు, ఎన్నో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

%ఒత్తిడి

మసాజ్ చేయడం వల్ల శరీరంలోని కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. ఈ కార్టిసోల్ హార్మోన్ వల్లే ఒత్తిడి అధికంగా అనిపిస్తుంది. మనకి ఏదైనా ఒత్తిడిగా అనిపించింది అంటే శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఉత్పత్తి అవుతోందని అర్థం. ఈ హార్మోన్స్ స్థాయిలను తగ్గించడం ద్వారా ఒత్తిడి, మానసిక ఆందోళనలను అదుపులో ఉంచవచ్చు. ఫలితంగా మనసు శరీరం, రిలాక్స్ గా ఉంటాయి.

కండరాల నొప్పి

బాడీ మసాజ్ చేయడం వల్ల శరీరం మొత్తం రక్తప్రసరణ సవ్యంగా జరుగుతుంది. శరీరానికి ఆనందాన్,ని ప్రశాంతతను అందించే ఎండార్ఫిన్ హార్మోను విడుదల చేయడానికి బాడీ మసాజ్ సహకరిస్తుంది. దీనివల్ల కండరాల ఒత్తిడి, నొప్పి తగ్గుతాయి. ఇది శారీరక ఆరోగ్యానికి మంచిది.

నిద్ర కోసం

నిద్రపోయే ముందు మసాజ్ చేయించుకుంటే ఎంతో ప్రశాంతంగా నిద్ర పడుతుంది. బాడీ మసాజ్ చేయించుకున్న వారికి నిద్ర నాణ్యత ఎక్కువ. శరీరం, మనసు రెండూ ప్రశాంతంగా ఉంటాయి. కనుక నిద్ర కూడా సంపూర్ణంగా పడుతుంది. ఆందోళన, ఒత్తిడి లాంటివి ఉండవు.

రోగనిరోధక శక్తికి

బాడీ మసాజ్ చేయడం వల్ల రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇవి ఒత్తిడి హార్మోన్ ను తగ్గించడమే కాదు తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. తెల్ల రక్త కణాల సంఖ్య పెరగడం వల్ల మన రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. తక్కువ అనారోగ్యాలకి గురవుతారు. అందుకే వారానికి ఒకసారైనా కచ్చితంగా మసాజ్ చేయించుకోవాలి.

అలసట తగ్గి...

బాడీ మసాజ్‌లు వారానికి రెండు లేదా మూడుసార్లు చేయించుకుంటే మానసికంగా అలసట తగ్గుతుంది. మెదడుకు రక్త ప్రవాహం పెరుగుతుంది. దీనివల్ల ఆలోచనల్లో, నిర్ణయాల్లో స్పష్టత పెరుగుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. ఉత్పాదకత, సృజనాత్మకత లాంటివి పెరుగుతాయి.

ఆపరేషన్ చేయించుకున్నాక శరీరం మొత్తం మళ్లీ సవ్యంగా రక్తప్రసరణ చేయడానికి బాడీ మసాజ్ ఉపయోగపడుతుంది. గాయాల వల్ల కలిగే నొప్పి నుంచి ఈ మసాజ్ ఉపశమనం లభిస్తుంది.

## డ్రైఫ్రూట్స్ చిక్కీ ఇంట్లోనే ఇలా చక్కగా చేసేయండి

**కావాల్సిన పదార్థాలు, బాదం పప్పులు - పదిహేను**
**జీడిపప్పులు - పది, పిస్తా పప్పులు - పది**
**గుమ్మడి గింజలు - మూడు స్పూన్లు, ఎండు నల్ల ద్రాక్షలు - పది**
**నువ్వులు - నాలుగు స్పూన్లు, బెల్లం తురుము - ఒక కప్పు**
**నీళ్లు - సరిపడా, నెయ్యి - ఒక చెంచా**

కావాల్సిన పదార్థాలు

1. బాదం పప్పులు, జీడిపప్పులు, పిస్తాలు, ఎండు నల్లద్రాక్షలు సన్నగా తరుక్కోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి డ్రై ఫ్రూట్స్‌ని వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి.
3. ఇప్పుడు అదే కళాయిలో ఒక చెంచా నెయ్యి వేయాలి. అందులో ఒక కప్పు బెల్లం, కాస్త నీరు వేసి బాగా కలుపుకోవాలి.
4. బెల్లం పాకం వచ్చేలా తయారయ్యాక అందులో ముందుగా వేయించిపెట్టుకున్న నట్స్ తో పాటూ, వేయించిన నువ్వులు, గుమ్మడి గింజలు కూడా వేసి బాగా కలపాలి.
5. ఒక పళ్లానికి అడుగున నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని పోయాలి.
6. కాస్త గోరువెచ్చగా ఉన్నప్పుడు ముక్కలుగా చాకుతో కోసి, ఎండాక ముక్కలు తీసి ఒక డబ్బాలోదాచుకోవాలి. అంతే పోషకాల చిక్కీ రెడీ అయినట్టే.

చలికాలంలో డ్రైఫ్రూట్స్ తినడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ కాలంలోనే రోగనిరోధక శక్తి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల ఆ శక్తి పెరుగుతుంది. ఈ సీజన్లో వచ్చే ఎన్నో అనారోగ్యాలకు ఇవి చెక్ పెడతాయి. ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్ అధికంగా ఉంటాయి. శరీరంలో రక్తప్రసరణను, హిమోగ్లోబిన్ స్థాయిలను మెరుగుపరుస్తాయి. వీటిలో ఫ్లేవనాయిడ్స్, యాంటీ యాక్సిడెంట్లు క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. ఫ్రీరాడికల్స్ తో పోరడతాయి.



## మిగిలిన ఉప్మాతో టేస్టీగా బోండాలు, పిల్లలకు నచ్చేస్తాయి

ఇంట్లో ఉప్మా చేస్తే చాలా వరకు మిగిలిపోతుంది. కారణం ఎక్కువమందికి నచ్చకపోవడమే. అలా ఉప్మా మిగిలిపోయినప్పుడు పడేయకుండా బోండాలు చేసుకుని తింటే బావుంటాయి. పిల్లలకు ఇవి బాగా నచ్చుతాయి. ఉప్మా తినని పిల్లలకు ఇలా బోండాలు చేసి పెడితే తినేస్తారు. ఆలూ బోండాలాగే ఉప్మా బోండాలు కూడా చాలా రుచిగా వస్తాయి.

**కావాల్సిన పదార్థాలు**
**వండిన ఉప్మా - రెండు కప్పులు**
**బియ్యప్పిండి - రెండు స్పూన్లు**
**కారం - అర టీస్పూను**
**వాము - అర టీస్పూను**
**బేకింగ్ సోడా - పావు టీస్పూను**
**శెనగపిండి - ఒక కప్పు**
**నీళ్లు - తగినన్ని**
**ఉప్పు - రుచికి సరిపడా**
**నూనె - వేయిండానికి సరిపడా**
**కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు**


తయారీ ఇలా

1. ఉప్మా మీకు నచ్చిన విధంగా వండుకోవాలి. చల్లారాక వాటిని ఉండలుగా చుట్టుకోవాలి.
2. ఇప్పుడు ఒక గిన్నెలో శెనగపిండి, బేకింగ్ సోడా, బియ్యప్పిండి, వాము, కారం, ఉప్పు వేసుకుని బాగా కలపాలి.
3. కొంచెం కొంచెం నీళ్లు కలుపుకుని ఉండలు కట్టకుండా కలపాలి. బోండాలు వేసుకోవడానికి వీలుగా చిక్కగా కలుపుకోవాలి.
4. కొత్తిమీర తరుగు కూడా వేసి బాగా కలపాలి.
5. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.
6. నూనె వేడెక్కాక రుబ్బులో ముంచుకున్న ఉప్మా ఉండల్ని తీసి నూనెలో వేసి వేయించాలి.
7. ఇవి వేడిగా ఉన్నప్పుడు తింటే మంచి రుచిగా ఉంటాయి.

ఉప్మా అనే పదం ఉప్పు, మావు అనే రెండు తమిళ పదాల నుంచి పుట్టింది. అదే తెలుగు ఉప్మాగా మారింది. ఉప్మాను కొంతమంది బొంబాయి రవ్వతో చేస్తే, మరికొందరు గోధుమ నూకతో చేస్తారు. ఉప్మా తినడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇది తినడం వల్ల చాలా త్వరగా జీర్ణం కాదు. పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఉప్మా మంచి ఎంపిక.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవిందనే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరవైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com